# దిగంత గానం

■ కాశీభట్ల వేణుగోపాల్

ఈ మహా పురాతన భూశరీరాన్ని చీల్చుకుని పొగరుగా పొంగిన ఆ కొండరాళ్ళ మధ్యలో... ఆ సముద్రపు అలలు విసిరేసిన నాదమయమైన హోరులో, ఆకాశంలో అనాథ అర్ధచంద్రుడు హృదయవిదారకంగా వెన్నెల్తో సముద్రాన్నీ, సమస్త ప్రపంచాన్నీ కలిపేయాలని ప్రయత్నిస్తోన్న తరుణంలో... వేణూ సుషిరం లోంచి ఓ ధీరగంభీర రాగం ఉద్విగ్నంగా.

ఎవరు? ఎవరది? ఈ పల్చటి వెన్నెల రాత్రిలో ఈ సముద్రపు ఒడ్డున, ఈ బండరాళ్ళ నడుమ ఆకాశాన్నీ, భూమినీ సంధిస్తూ... మనిషి అస్తిత్వాన్ని నిందిస్తూ ఎవరు? ఎవరది? ఉద్విగ్న గానం చేస్తున్నారు? ఎదో పారభౌతికతను ఆలింగనం చేసుకుని, ఈ దక్షిణ కాశ్మీరమని పిలిచే 'నార్త్ కెనరా' అనే ఉత్తర కన్నడ రాజ్యంలో పడమటి కనుమల శిఖరమ్మీద నిర్మించిన ఆరండ్బీ వారి 'గెస్టౌస్' అనే ఆరామ విరామ క్షేత్రంలో విడిది చేసిన నా చెవులకు ఆ అద్భుత గానం. ప్రాణ రహిత వేణూ సుషిరం లోంచే ప్రాణాలు తోడేసేలా.

కొండచరియ మీద కట్టిన ఆ గెస్టౌస్ ప్రాంగణంలో కూచుని నా చుట్టూ ఉన్న యావత్ప్రకృతినీ కుదించి కుదించి నా గ్లాసులోకి నింపుకుని తాగాలనే ప్రయత్నంలో నేనుండగా–

ఆ అద్భుత గానం!

డిసౌజా సాయంత్రానికి వచ్చేస్తానని పాణాజీ నించి ఫోన్‌చేశాడు. రాత్రి పదైంది. ఇంతవరకూ నా పతా. అంకోలాలో ఇరుక్కుపోయాడా? నాకు మాత్రమిక్కడ తనకున్న ఇన్ఫ్లుయెన్స్ వాడి అన్ని ఏర్పాట్లూ చేసేశాడు. ఈ కొండచరియ మీదున్న బంగ్లా గార్డెన్ ముంగిల్లో ఉన్న రేలింగ్ నానుకుని చూస్తే కింద సముద్రం. ఆ నల్లటి రాతి మొనలను తాకుతూ తాకుతూ... వాటిని కరిగించి తనలో కలుపుకునే ప్రయత్నంలో కన్పిస్తుంది. అలలు తలలు పగలగొట్టుకుంటున్న ష్...ష్...ష్...మనే హోరులోంచీ. పల్చటి వెన్నెల నిరామయుత లోంచీ. రేలింగ్‌కి ఆనుకుని నుంచున్న నన్ను తాకి చీలిపోతూ అరుస్తున్న సముద్రపు గాలి నించీ ఆ వేణు గానం... అది సూటిగా నా ఆత్మను తాకుతోంది. చుట్టూ చూశా. వరండా పై మెట్టు మీద కూచుని హాస్‌గాంకర్ సిగరెట్ కాల్చుకుంటున్నాడు. చప్పట్లు కొట్టి పిల్చా.

తలకున్న మంకీ కాప్ని సవరించుకుంటూ వచ్చాడు. వాడో పాలీగ్లాట్. ప్రపంచంలోని అన్ని భాషలూ మాట్లాడ్తాడు.

రేలింగ్ కానుకుని కిందికి ఆ సముద్రమూ, నల్లటి కొండరాళ్ళూ రాక్షస రతి సలుపుకుంటున్న ఆ మసక చీకట్లోకి వేలు చూపిస్తూ అతన్ని అడిగా:

"ఎవరది?"

మురళి వాయిస్తున్నట్టు మైమ్ చేస్తూ, "అదేనా" అనడిగాడతను.

అవునన్నట్టు తలూపాను.

సిగరెట్ దమ్ములాగి, ఆ పీకని చూపుడు వేలూ, బొటన వేలూ మధ్యనెట్టి, కిందికి ఓ మీటు మీటి, నోటికి చెయ్యడ్డం పెట్టుకుని, ఆ సముద్రపు గాలి హోరును జయించే ప్రయంత్నంలో, "నిజంగా తెలుసుకోవాలంటే రేపు 'అచ్చోరిన హళ్ళి'కి మనం వెళ్ళాల్సిందే" అని అరుస్తూ అన్నాడు. ఇంతలో డిసౌజా జీపొచ్చి పేటియోలో ఆగింది. హాస్‌గాంకర్ పరిగెత్తుకెళ్ళాడు. డిసౌజా డబ్బూ, హోదాల శక్తి అతన్ని అయస్కాంతంలా లాగిపారేసిందని నాకు తెల్సు.

రానీ, డిసౌజానే అడుగుదాం అనుకొని, మళ్ళీ ఓ మాటు నాకు వినిపిస్తున్న అదృశ్య వేణు గానాచిత్రాన్ని చూట్టానికి విఫల యత్నం చేసి, వెచ్చటి, చల్లటి, ఉప్పటి ఆ సముద్రపు గాలిని పీలుస్తూ వచ్చి లాన్లో కేన్ చేర్లో కూలబడ్డా.

హాస్‌గాంకర్ ఆ గెస్టౌస్‌కి కేర్‌టేకర్. అతనూ, అతని భార్యా అక్కడే ఉంటారు. పిల్లల్ని సాంగ్లిలో ఉంచి చదివిస్తున్నానని చెప్పాడు. వచ్చిన గెస్ట్‌లకి అతని భార్యే వంట చేసిపెడుతుంది.

ఆ నులివెచ్చటి చలీ, సముద్రపు రుచితో ఆ గాలీ, నా లాల్చీ లోంచి నా ఎదని తాకి నన్ను నగ్నం చేస్తున్న భావన.

"సారీ బాస్! కున్స్ట్ గెట్రిడాఫ్ దట్ ఫకర్ షిండే అటంకోలా హౌస్ ద డే... ఎన్జాయింగ్?" వచ్చి కుర్చీలో ఒళ్ళు విరుచుకుంటూ కూలబడ్డాడు. బలిష్ఠంగా కండలు తిరిగిన ఒంటితో, జీన్స్ స్పోర్ట్స్ షూతో విండ్‌షీటర్‌లో ఉన్న డిసౌజాకి నలభై అయిదేళ్ళంటే ఎవరూ నమ్మరు.

హాస్‌గాంకర్ వచ్చి డిసౌజాకి విస్కీ కలిపి ఇచ్చాడు.

నువ్వికెళ్ళు అన్నట్లు వేలాడించాడు డిసౌజా.

అప్పుడడిగా డిసౌజాని, "ఆ వేణుగానం వినపడ్తోందా నీకు" అని.


వినడానికి ప్రయత్నించకుండానే తెలుసన్నట్టు తలాడించి, "అది వాయించే వాడికి వంద సంవత్సరాల పైబడే వయస్సట. వాడిన్నేనెప్పుడూ చూళ్ళేదు. వాడిన్చూసిన వాళ్ళూ తక్కువే. ఆ కొండల మధ్యా ఓ చిన్న గూడెం లాంటిదుంది. అక్కడివాడట. అక్కడ కూడా గూడెంలో ఉండడట. ఇదుగో ఇలా వెన్నెల రాత్రిళ్ళు ఇలా సముద్రపొడ్డుకొచ్చి వేణువు వాయిస్తాడట. ఇదిగో ఈ వెధవ హాస్గాంకర్ వాడి గురించి కథలు చాలా చెప్తూంటాడు" అన్నాడు డిసౌజా.

"ఆ వేణువులో ఏదో అరణ్యరోదన... అసలు అదే అరణ్యమేమోనన్న భావన కలుగుతోంది. ఆ వేణుగానం ఈ సముద్రపు ఒడ్డు నుంచి సముద్రపు మరో ఒడ్డుకు వినిపించాలనే ఉద్వేగభరితమైన ఆర్తి స్ఫురించడం లేదూ" అనడిగాను.

గట్టిగా నవ్వాడు డిసౌజా, "మీ కళాకారుల్తో వచ్చిన చిక్కే ఇదయ్యా. ఎక్కడా ఏమీలేని తనంలోకి ఏవేవో చొప్పించేసి, మీరు చూసినట్టూ, అనుభవించినట్టు నటించి, ఎదుటివాళ్ళని కూడా నమ్మమంటారు" అంటూ మళ్ళీ చప్పట్లు కొడ్తూ నవ్వాడు గట్టిగా.

నేనూ అతన్తోపాటు నవ్వి, "లేదు లేదు. ఎందుకో నిజంగానే నాకలా అనిపించింది. రేపుదయాన్నే హాస్గాంకర్తో కలిసి, ఆ వ్యక్తిని కలుస్తా" అన్నాను.


"ఆర్యూ సీరియస్?" సూటిగా చూస్తూ అడిగాడు. అవునన్నట్టు తలాడించా.



చిత్రాలు: నర్సిం

**నన్ను తాకి చీలిపోతూ అరుస్తున్న సముద్రపు గాలి నించీ ఆ వేణుగానం... అది సూటిగా నా ఆత్మను తాకుతోంది.**

## ‘ఇది వీరి యుద్ధ సంకేతగానం, ఇది ప్రేమైక గానం, విరహ సంకేత గానం. యుద్ధ వాతావరణాన్ని కానీ, విరహాన్నిగానీ సంకేతిస్తూ వేణుగానం చేస్తారు.’



తలెగరేసి నవ్వి. "అక్కడికి, ఆ గూడేనికి నడిచే వెళ్ళాలి. నీచేతనవుతుందా? అందునా సుకుమారుడివి. నిన్ను భద్రంగా వొప్పజెబుతానని మీ ఆవిడకీ, నీ కూతురికీ మాటిచ్చి, ఆంధ్రానించి నిన్నిక్కడికి తీసుకొచ్చాను" అన్నాడు డిసౌజా. అది నా జవాబాసించకుండానే జేబులోంచి సెల్ ఫోన్ తీసి, అవతల వ్యక్తి ఎవరో నాకు తెలీదు కానీ... "అయ్ వోంట్బీ ఎవేలబుల్ టుమారో. నో... ఫర్‌గెటిట్. ఇట్ కెన్ వెయిట్... యస్ యూ కెన్... యూ నో అన్లెసిటీజెనెక్సిజెన్సీ" అని కట్చేసి, నా వేపు తిరిగి, "మనమెళ్తున్నాం రేపుదయాన్నే" అన్నాడు.

తర్వాత మా సంభాషణ నైమిత్తికాలకు మళ్ళింది.

* * *

ఉదయాన్నే బ్రేక్‌ఫాస్ట్ అవగానే నేనూ, డిసౌజా హొస్గాంకరూ బయల్దేరాం. హొస్గాంకర్ ఆవేశంగా మాట్లాడుతున్నాడు ఆ ముసలివాడి గురించి. ఆ గూడేనికి పేరు అచ్చోలినహళ్ళి అన్నాడు. ఆ ముసలాడు గూడేనికి బయట ఓ చిన్న పూరికొంపలో ఉంటాట్ట. వాడు గూడెం కంటే ముందువాడట. పగలెక్కడికీ వెళ్ళడట. గూడెంలో వాళ్ళే ఎవరో ఒకరింత పారేస్తే తింటాట్ట. చాలాచాలా కుంగిపోయి, శిథిలమైపోయి ఉంటాట్ట. అతను ఎవర్తోటీ మాట్లాడట. ఇలా వెన్నెల రాత్రిళ్ళు మాత్రం పడుతూ లేస్తూ ఆ కొండరాళ్ళను దాటుకొని సముద్రపు ఒడ్డున కూచుని ఆర్తితో వేణుగానం చేస్తాడట. ఇట్లా హొస్గాంకర్ ఏవో చెబుతున్నాడు. అతని మాటలు కొద్దిగానూ, చుట్టూ అరణ్యంలోని వింత శబ్దాలను ఎక్కువగానూ వింటూ నడుస్తున్నా.

ఆ పల్లెకాని పల్లెలాంటి గూడేనికి చేరుకునేసరికి అలుపొచ్చేసింది. పల్లెలో వాళ్ళు మమ్మల్ని వింతగానూ. భయంగానూ చూస్తున్నారు. మాకూ, వాళ్ళకూ మధ్య నాగరికత గీచిన రేఖ జెర్రిగొడ్డులా కనిపిస్తోంది. గూడేనికి చివరగా ఉన్న ఆ ముసలివాడి పూరి గుడిసెను చేరుకున్నాం. హొస్గాంకర్ లోపలికెళ్ళి ఆ ముసలాడితో ఏదో అన్నాడు గట్టిగా రెండు మూడుసార్లు. మళ్ళీ బయటికి వచ్చి, "వాడు బయటికి రావడం లేదు. ఉట్టినే పిచ్చి చూపులు చూస్తున్నాడు. వాడికి వినిపించను కూడా వినిపించదేమోననిపిస్తోంది" అన్నాడు.

ముగ్గురం లోపలికెళ్ళాం.

గుడిసె మధ్య గుంజకానుకుని ఓ శిథిల మానవాకృతి. చూడగానే కొట్టొచ్చినట్టు అతనిలో నీగ్రాయిడ్ లక్షణాలు. ఆశ్చర్యపోయాను. డిసౌజా వేపు అర్థవంతంగా చూశా. డిసౌజా కూడా అదే భావనతో ఉన్నాడని స్పష్టమైంది. తలాడిస్తూ, "యస్. హి ఈజె నిగ్రో" అన్నాడు. నేను గుడిసె అంతా కలయజూశాను.

ఓ మూలగా ఓ చిన్ని పేకు పెట్టె, ఓ అల్యూమినియం బొచ్చె, ఓ పొడవాటి అల్యూమినియం గ్లాసూ. మూలగా ఓ కుండ, పక్కకి దండేనికి వేలాడ్తూ ఓ తుండూ తప్ప ఇంకేమీ కనిపించలేదు. అతని మంత్ర గానపు మూలసూత్రం కోసం వెదికా. అతని పక్కనే ఉంది.

వెదురు మురళి. నల్లగా కాల్చినది. చాలా చాలా పాతది. ఎప్పటిదో ఏవో పురాతన నాగరికతల్లోంచి వచ్చినది. మౌనంగా ఆరు నేత్రాల్తో మమ్మల్నందరినీ చూస్తోన్నట్టు... అతని పక్కనే.

అతని పక్కన కూచుని దాన్ని చేతిలోకి తీసుకోబోయా. నాగుపాములాగా చురుగ్గా, విసురుగా అతని చేయి దాన్ని తీసేసుకుంది.

"వద్దు. తాకొద్దు" అన్నాడు డిసౌజా. అని 'బయటికి రా' అన్నట్టు సైగ చేశాడు.

ముగ్గురం ఆ వృద్ధుణ్ణి వదిలేసి బయటికొచ్చాం. మాకు దూరంగా వెళ్ళి హొస్గాంకర్ సిగరెట్ వెలిగించుకున్నాడు. నేనూ, డిసౌజా ఓ బండరాతి మీద కూచున్నాం.

"ఇక్కడ ఈ ప్రాంతంలో ఈ ఆఫ్రికన్స్ చాలామందున్నారు. ఎప్పుడో వీళ్ళను బానిసలుగా చేరేస్తున్న ఓడ ఒకటి ప్రమాదానికి లోనైతే వాళ్ళలో కొందరు అట్లా ఈదుకుంటూ ఈ ప్రాంతానికి చేరుకున్నారని ఓ కథనం. కానీ, వాళ్ళందరూ సిరిసి, యల్లాపూర్, డ్యాం డేలీ ప్రాంతంలో కలిసే ఉంటారు. ఇక్కడ ఈ మారుమూల ఈ ముసలివాడొక్కడే వచ్చి ఎలా చేరాడో అర్థం కావడం లేదు." ఊపిరి తీసుకోవడానికన్నట్టు ఆగాడు డిసౌజా.

"ఇంకా వీళ్ళ గురించి వివరంగా చెప్పు." సిగరెట్ వెలిగించుకుని అడిగా.

"వీళ్ళందర్లోనూ బాంటూ అన్న తెగవాళ్ళు చాలామంది. వీళ్ళు ఆఫ్రికాలో దాదాపు నూటెనభై రెండొందల మిలియన్లున్నారని వినికిడి. అందులో మళ్ళీ ఓ మూడొందల్దాకా తెగలు. ఏ తెగకు ఆ తెగ ఓ నాగరికత. దానికో ప్రత్యేక భాష, ప్రత్యేక సంప్రదాయం. నాకు తెలిసీ ముఖ్యంగా... జులూ, కికూ యూ స్వాహిలీ తెగలు. వీడిన్చూస్తుంటే జులూ తెగవాడిలా ఉన్నాడని నాకనిపిస్తోంది. వీళ్ళందరూ యోధులే" అని గట్టిగా నవ్వాడు.

"లేదు లేదులే. నాకు వీళ్ళందరూ ఒక్కలాగే కనబడ్డారు. సరదా కన్నానలా. వీడొక్కడూ ఇక్కడికెలా చేరాడో అర్థం కావడం లేదు." ఇంకా నవ్వుతూనే అన్నాడు. సరదాకన్నానని డిసౌజా అన్నా, అతని జ్ఞాన విస్తృతి నాకు తెలుసు. నా జ్ఞానాన్ని ఇంకో పేజీకి పెంచాడు డిసౌజా.

ఆ వృద్ధుడు బయటికీ రాలేదు, మాతో మాట్లాడనూ లేదు. మాకోసం ఆ మురళి వాయించనూ లేదు. ఒక పెద్ద నిరాశను మోసుకుని నేనూ, డిసౌజా, హొస్గాంకర్ తిరిగొచ్చేశాం. గెస్ట్‌హౌస్‌కి రాంగానే అలుపుతో నేను బెడ్ మీద పడిపోయాను.

* * *

ఆ తర్వాత ఊరొచ్చేశాను. మామూలు యాంత్రికత్వాన్ని కప్పుకునే తిరుగుతున్నాను. అన్నీ చేస్తున్నాను కానీ, ఆ ఆఫ్రికన్ ముసలాడి వేణుగానం మాత్రం నన్ను వెంటాడుతూనే ఉంది.

ఓ రోజు ఇంటికి రావడం ఆలస్యమైంది. దాదాపు అర్ధరాత్రి పన్నెండు అవుతోంది. తలుపు పక్కనే ఉన్న బజర్ నొక్కబోతోంటే ఒక్కసారి ఒళ్ళు గగుర్పొడిచేలా నా ఇంట్లోంచి 'ఆ' వేణుగానం. నా రోమాలు నిక్కబొడ్చుకున్నాయి. ఏమిటిది? ఆ రోజు అక్కడెక్కడో పడమటి కనుమల్లో, కొండ చరియల మధ్య, సముద్రం పక్కన ఆ ఆఫ్రికన్ వృద్ధుడి వేణుగానం- ఇక్కడ నా డ్రాయింగ్ రూమ్‌లోంచి ఈ అపరాత్రి వినిపిస్తోందేమిటి? కాలింగ్ బెల్ నొక్కాను.

కావేరి తలుపు తీసింది.

నా ఆలస్యానికి సంజాయిషీ కానీ, తనను మామూలుగా పలకరించే పలకరింపు కానీ- ఇవేవీ లేకుండా పరుగులాంటి నడకతో డ్రాయింగ్ రూమ్‌లోకొచ్చేశాను. ఎదురుగా టీవీ. నిద్రపట్టక కావేరి లేచి నాకోసం ఎదురు చూస్తూ టీవీ ఆన్ చేసి కూచున్నట్టుంది. విదేశీ చానల్లో ఆఫ్రికన్ తెగల మీద డాక్యుమెంటరీ. నారేటర్ చెప్తోంది... 'వినండి ఇది వీరి యుద్ధ సంకేతగానం, ఇది ప్రేమైక గానం, ఇది విరహ సంకేత గానం. యుద్ధ వాతావరణాన్ని కానీ, విరహాన్ని గానీ సంకేతిస్తూ వీళ్ళీ వేణుగానం చేస్తారు.' ఇంకా ఏమేమో చెప్తోంది. నా చెవికెక్కలేదవన్నీ.

ఆ మారుమూల కొండచరియల్లో కూచుని ఆ శత వర్ష వృద్ధుడు ఆలపిస్తున్నది ఏ గానం? అందిస్తున్నదే సంకేతం? ఎవరికి? తనను బానిసగా మోసుకొచ్చిన వాళ్ళపైకి యుద్ధానికి రా రండని తన తెగవాళ్ళకి పిలుపునిస్తున్నాడా, లేదూ ఎప్పుడో దశాబ్దాల క్రితం విరిసీ విరియని వయసులో తన మనసును మెలి తిప్పిన ఎవరో శ్యామసుందరికి, 'ప్రియా! ఇక్కడెక్కడో నాకే తెలీని చోట పడివున్నాను. వస్తాను. ఎలాగోలా ఎప్పటికైనా వస్తాను. ఎన్ని యుగాలైనా సరే ప్రియా వస్తాను... వస్తాను...' అని ప్రేమ సందేశం పంపుతున్నాడా?

ఏ నాగరికతలు? ఏ గొప్ప సంస్కృతులు? సాటి మనిషినే బానిసగా చేసుకుని హేయంగా వాడుకునే ఏ గొప్ప జాతులు దీనికి సమాధానం చెప్పగలవు? ■